# చిట్లిన సూర్యుడు

అదొక అడవి.

చీమలు దూరని చిట్టడవీకాదు. కాకులు దూరని కారడవీ కాదు.

ఆ అడవిలో చీమలున్నాయి. కాకులున్నాయి. మేకలున్నాయి. పులులున్నాయి. పావురాలున్నాయి. ఇంకా ఎన్నో రకాల ప్రాణులున్నాయి.

ఒక పచ్చనిచెట్టు వుంది దానికి కొమ్మలున్నాయి. రెమ్మలున్నాయి. కొమ్మల మీద పావురాలున్నాయి. తిండి దొరికిన పావురాలు నవ్వుకుంటూ దొరకని పావురాలు వుసూరుమంటూ బతుకుతున్నాయి.

ఇలా వుండగా, తిండి దొరకడం కష్టమవుతుండగా. ఆహారం కోసం పడిగాపులు పడుతుండగా పావురాల కళ్లు ఒక్కసారిగా ఆనందంతో మెరిశాయి, ఏ కన్నతల్లి కరుణించిందోనని పావురాల ఒల్లు పులకించాయి.

పావురాలన్నీ రెక్కల్ని రెపరెపలాడించి, ఒక్కసారిగా లేచి,

కొమ్మలమీదనుంచి గాలిలోకి యెగిరాయి. నెమ్మదిగా నేలమీద వాలాయి. నూకల్ని ఏరుకుంటూ, తింటూ, తన్మయత్వంతో లోకం అంతా పచ్చగా వుందనుకుంటూ తృప్తిగా అక్కడక్కడే నూకలున్నచోట తిరగసాగాయి.

అంతలో పావురాలు గడగడ వణికాయి. భయంతో గిలగిల లాడాయి. ఆకాశం భూమిమీద పగబూని, ఏ పాముల వలను తమ మీద పన్నిందోనని పావురాలు కన్నీరు కార్చాయి. బాధతో మెలి తిరిగి పోయాయి.

"తమ్ముడూ, మోసపోయాం పూర్తిగా మోసపోయాం. ఇప్పుడెలా బతికి బయటపడాలో అంతు చిక్కడం లేదు" అంది పెద్దపావురం.

"అన్నా" అంది చిన్న పావురం ఏం చెయ్యాలో తెలియక.

తిన్న నూకలన్నీ పావురాలకు నిప్పులఅవ్వల్లా అనిపించాయి.

ఒక మేధావి పావురం కంఠం విప్పింది మిగతా పావురాలన్నీ ఆత్రుతగా అటు తిరిగి జాగ్రత్తగా వినసాగాయి.

"డియర్ కామ్రేడ్స్, మనం ఘోరాతి ఘోరంగా మోసపోయిన మాట నిజమే. అయితే, మనం యిప్పుడేడుస్తూ కూచుంటే లాభం లేదు. గడ్డిపోచలన్నీ కలిస్తే ఏనుగునైనా బంధించగలవనే విషయం మీకందరకూ తెలిసిందే. అందుచేత, మనమందరం కలిసి, ఒక్కసారిగా బలంగా వేగంగా పైకెగురుదాం. ఈ వలతో పాటుగా ముందీ ఆపద నుంచి తప్పించుకుందాం".

ఈ ప్లాను మిగతా పావురాలకు బాగా నచ్చింది. అన్నీ వూపిరి పీల్చుకుని, ధైర్యాన్ని తెచ్చుకుని పైకెగిరాయి. వల విలపిస్తూ వాటితో పాటు ఆకాశంలో కెగిరింది.

దూరాన దాక్కొని పొంచిచూస్తున్న బోయవాడు కెవ్వున కేకేశాడు.

అతని శరీరం నిండా చెమటలు పట్టేశాయి. అతని శరీరం నిండా చెమటలు పట్టేశాయి. "అయ్యో. అయ్యో, నా వల. బంగారు వల" అంటూ అరుస్తూ, ఏడుస్తూ పరుగెత్తసాగాడు.

బోయవాడి తలమీద "తెల్లపాగా" వుంది. నుదుటున "మూడు విభూతిరేఖ" లున్నాయి. వాటి మధ్యన పుసిరికాయంత ఎర్ర "బొట్టు" వుంది.

పైన పావురాలు రెక్కల్లోకి సత్తువ తెచ్చుకుంటూ, వలను మోస్తూ ఉత్సాహంగా ఎగురుతున్నాయి.

కింద, వలను తలచుకుని విలపిస్తూ, ముళ్ళనూ రాళ్లనూ లెక్క చెయ్యకుండా, తలయెత్తి చూస్తూ, నిట్టూరుస్తూ, పావురాలను తిట్టుకుంటూ బోయవాడు పరుగెడుతున్నాడు.

ఆకాశంలో మేఘం పరుగెత్తుతున్నట్టు వుంది పావురాళ్ల కాళ్ల కిందున్న వల.

తప్పించుకుని పారిపోయిన కప్పమీద కోపంతో విషం కక్కుతూ కప్పని తరిమే పాములా వున్నాడు చెమటలు కారుస్తూ పరుగెడుతున్న బోయవాడు.

పయనిస్తున్న పావురాల్లో ఒక పావురానికి స్పీడుగా ఒక ఐడియా వచ్చింది. ఆ పావురం అంత స్పీడుగానూ యిలా అంది.

"ఇలా యెంత దూరమని ఎగురుతాం కామ్రేడ్స్. ఇంతగా భయపడి పారిపోవడమెందుకు? ఏం సాధిద్దామని? మనకు పదునైన ముక్కులున్నాయి. వాటితో వలను కొరికేద్దాం. హాయిగా ఎగిరిపోదాం."

అప్పుడు మరో పావురం కొంచెం ఆలోచించి యిలా అంది.

"డియర్ కామ్రేడ్స్. మన మిత్రుడు చెప్పింది పూర్తిగా సరియైన ఆలోచనకాదు. మనం స్వేచ్ఛగా సుఖంగా విహరించడానికి యెప్పటికైనా వలను కొరికెయ్యాల్సిందే. కాని, అదిప్పుడు సాధ్యం కాదు. ఎందుకంటే వలయింకా చీకిపోలేదు"

ఈ రెండు వాదనలూ విన్న పావురాలు కొన్ని ఒక పక్షం మరి కొన్ని ఇంకో పక్షం అయ్యాయి, రెండు పక్షాలూ పరస్పరం విమర్శించు కున్నాయి, దూషించు కున్నాయి.

రెండు పక్షాల పావురాలు యింతకుముందు చేసిన 'మంచి' ని మరచిపోయాయి. తాము సాధించిన పాక్షిక విజయాన్ని పూర్తిగా విస్మరించాయి. ఒకరి మాటలు మరొకరికి చేదు మాత్రల్లా అనిపించాయి.

ఒక పక్షం ఒక వైపుకూ, రెండో పక్షం మరొక వైపుకూ, కోపంగా ఎగరబోయాయి. అటూ యిటూ లాక్కోవడంవల్ల ఎటూ ప్రయాణించలేకపోయాయి. నేల మీదకు దిగిపోయాయి. మళ్లీ విమర్శించుకోసాగాయి, దూషించుకోసాగాయి.

"మీ దారి మీది. మా దారి మాది. మాకూ మీకూ పచ్చి" అని రెండు పక్షాల పావురాలు గట్టిగా అనేశాయి. తలలు తిప్పేసుకున్నాయి.

"మీరిలా ప్రవర్తించడం అనాలోచితం. మూర్ఖత్వం. మీ కిది కూడదు. మన సమస్యను పరిష్కరించుకోడానికిది మార్గం కాదు" అన్నాయి కొన్ని పావురాలు శాంతంగా.

వాటిని మిగతా పావురాలు చీదరించుకున్నాయి. అదోలా చూశాయి. ఆఖరికి గమ్యాన్ని గాలికి వదిలేశాయి.

పక్కనే ప్రవహిస్తున్న సెలయేరు వాటి మాటలు విని, ఏడ్వలేక పిచ్చిగా గలగలా నవ్వుతూ పోతోంది.

ముందున్న పూలమొక్కలు పావురాల చేష్టల్ని చూసి, బాధతో విలవిలలాడుతూ వూగిపోయాయి.

క్షణాలు కొన్ని క్షేమంలేక క్షీణించిపోయాయి

ఒగురుస్తూ, ముఖం తుడుచుకుంటూ బోయవాడు పరుగు పరుగున వచ్చాడు అక్కడకు. పంతాలకు పోయిన పావురాలను చూసి, విపరీతంగా సంతోషించాడు. అంతలోనే పావురాలను పట్టుకోబోతున్న మరో బోయ వాడ్ని చూశాడు.

"ఈ పావురాలు నావి. ఈ వల నాది. నువ్వు ముట్టుకోడానికి వీల్లేదు." అన్నాడు "వల" బోయవాడు.

"నేను ముందు చూసేను. లేకపోతే. ఈ వలా, పావురాలూ కూడా దక్కేవికావు" అన్నాడు రెండో బోయవాడు.

చివరకు బోయవాళ్లిద్దరూ కూడబలుక్కుని, పావురాల్ని చెరిసగం పంచుకుని, తిన్నన్ని పావురాలను వండుకుతిని. మిగతావాటిని అమ్ముకుని డబ్బు చేసుకున్నారు.

( ఆంధ్రజ్యోతి వారపత్రిక, 21-2-'75 )